కథ

# పాత సంచి

-ఎ.ఆర్.స్వామి

**అప్పుడు** నాకు పదేళ్ళు. వేసవి శలవల్లో మా తాతగారి ఊరికి వెళ్దామని మా అమ్మా, నాన్న చెప్పినపుడు నేనెంతో సంతోషపడ్డాను. వేసంగి శలవలు ఎప్పుడు వస్తాయా అని ఎంతో ఆసక్తితో, ఆనందంతో ఎదురు చూశాము. నాగపూర్‌లో 'ఇత్వారీ' అనే ప్రాంతంలో మా తాతగారు 'జైభజరంగ్' అనే స్పిన్నింగ్ మిల్‌లో పని చేస్తూండేవారు. అక్కడ దగ్గరలోనే ఒక క్వార్టర్‌లో ఉంటూండేవారు.

కలకత్తా నుండి మా అత్తా పిల్లలూ, వైజాగ్ నుండి నేనూ, తమ్ముడూ మా అమ్మా, నాన్న మేమంతా నాగపూర్‌లోని మా తాతగారి ఇంటికి చేరాము. మేం అక్కడ ఉన్న పదిహేను రోజులూ మా తాతగారు మమ్మల్ని ఎంతో ప్రేమాభిమానాలతో చూశారు. మాకు కావలసినవన్నీ కొనిస్తూ మాకిష్టమయిన పిండివంటలు మా బామ్మచేత చేయించి నన్ను ఎంతో అల్లారు ముద్దుగా చూశారు. నేను ఆ పదిహేను రోజులు ఎంతో ఆనందంగా, ఉల్లాసంగా గడిపాను.

నాకిప్పటికీ జ్ఞాపకం. మాతాతగారి దగ్గర కలంకారీ అద్దకంతో బొమ్మలున్న గుడ్డసంచీ ఒకటి ఉండేది. బజారు నుండి ఏ సామాను తేవాలన్నా మా తాతగారు దాన్ని చేత్తోపుచ్చుకుని, ఊపుకుంటూ గర్వంగా నిటారుగా నడుస్తూ వెళ్తుంటే ఆయన్ని నేను అనుసరిస్తూండే వాణ్ణి. మేము అక్కడ ఉన్న పదిహేను రోజులూ మాకు 'గడ్డ పెరుగన్నం' తినిపించాలని, ఉదయాన్నే 'మీటరుగేజి చిన్న రైలు' ఇత్వారీ రైల్వేస్టేషనుకి వచ్చే సమయానికి ఆ స్టేషన్ చేరేవారు. రోజూ చిన్న రైలుబండిలో చుట్టు ప్రక్కల పల్లెటూళ్ళ నుండి గడ్డపెరుగు కుండలతో వచ్చేది. ఒకరోజు ఓ చిత్రం జరిగింది. పెరుగు తేవడానికని స్టేషనుకి వెళ్తూ మా తాతగారు పెరుగు గిన్నె, చేతి సంచి తసుకువెళ్ళడం మరచిపోయారు. స్టేషను నుంచి తిరిగి వచ్చి ఒక ఎర్ర గావంచా గుడ్డలో పెరుగు తీసుకువచ్చి గిన్నెలోకి వంపారు. అది చూసి మేమంతా ఆశ్చర్యపోయాం. గావంచా గుడ్డలో పెరుగెలా తెచ్చారా? అని. అటువంటి కల్తీలేని 'గడ్డ పెరుగు' దొరికేది ఆరోజుల్లో. కంచు కంచంలో నెయ్యితో కలిపిన పప్పు ముద్దలు మా పిల్లలందరికీ తన చేత్తో తినిపించేవారు మా తాత గారు. గడ్డ పెరుగన్నంలో తీపి మామిడి పళ్ళు రోజూ తప్పనిసరిగా వడ్డించేవారు. ఆ మామిడిపళ్ళను పిల్లలందరం జుర్రుతుంటే చూసి ఎంతో సంబరపడిపోయేవారు. అటువంటి కల్తీలేని సరుకులూ, సంబంధాలిప్పుడెక్కడివి? ఇప్పుడు అటువంటి ప్రేమాభిమానాలను పంచుకునే తాతా మనుమళ్ళేరి?

రోజూ సాయంత్రం పూట నేనూ మా తాత గారూ కలిసి అలా షికారుకని బజార్లోకి వెళ్ళేవాళ్ళం. బజారులో నేను వేలుతో చూపిన రకరకాల పళ్ళన్నీ కొని ఆయన కలంకారీ చేతి సంచీ నింపేవారు. దారిలో మరాఠీ వాళ్ళ మిఠాయి దుకాణాల దగ్గర నన్ను ఆపి సంత్రాబర్ఫీలు, పాలకోవాలు, వేడివేడి జిలేబీలు వేరువేరుగా పొట్లాలు కట్టించి, ఆ పొట్లాలతో సంచీ నింపేవారు. వస్తూ వస్తూ దారిలో నాకిష్టమయిన రెండు కూరగాయల్ని కూడా కొనేవారు. ఇల్లు చేరాక ఆ సంచీలోని సామాన్లన్నింటినీ జాలీ ఉన్న అలమారులో సర్ది అందరికీ తినిపిస్తూండేవారు. అందుకే ఆయనతో బజారుకెళ్ళడానికి మేమంతా ఉర్రూతలూగేవాళ్ళం. సరుకులన్నీ ఖాళీ చేశాక చేతి సంచీని జాగ్రత్తగా మడతపెట్టి భద్రంగా ఒక గూటిలో దాస్తూండేవారు.

000

మా ఇంటికెదురుగా ఉంటున్న రామారావు నా కొలీగ్. సర్వీసు నుంచి రిటైర్ అయి సంవత్సరం కావస్తోంది. ఆయనకి ఒక్కడే కొడుకు. ఇంజనీరింగ్ చదువు పూర్తయ్యాక అమెరికాలో ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. కోడలు కూడా అక్కడే ఏదో చిన్న ఉద్యోగం వెలగబెడుతోంది. భార్యాభర్తలిద్దరూ 'గ్రీన్‌కార్డు' హోల్డర్లు. వాళ్ళు స్వదేశం వచ్చే అవకాశం తక్కువ.

వాళ్ళకిద్దరు పిల్లలు. ఒక పాప ఒకబాబు. అక్కడే వాళ్ళ చదువులు. అందుచేత అక్కడే స్థిరపడ్డారు. రామారావుకి మాత్రం కొడుకూ, కోడలూ మనుమలతో ఈ ఊరులోనే సరదాగా శేషజీవితం గడపాలని ఉన్నా అవకాశం లేదు. ఆయన సొంతిల్లు, ఎంతో కాలంగా ఉంటున్న ఈ ఊరు వదలి అమెరికా వెళ్ళలేడు. అక్కడ స్థిరపడ్డ ఆయన కొడుకు, కోడలు, పిల్లలు అమెరికా వదలి ఈ ఊరు రాలేరు. మాకు ఇద్దరు మనుమలు బొద్దుగా, ముద్దుగా ఉంటారంటూ అక్కడ, వాళ్ళ వేడుకలు, సంబరాలు, సరదాలు, బర్త్‌డే ఫంక్షన్‌లో తీసిన ఫోటోల్ని ఇంటర్నెట్‌లో చూసుకుని, చుట్టు పక్కల వాళ్ళకి చూపిస్తూ మురిసిపోతూంటాడు. నాక్కూడా అప్పుడప్పుడూ ఆ ఫోటోలు చూపిస్తూంటాడు. కాని తాతగా అతని అచ్చటా ముచ్చటా తీరే అవకాశం లేదు. మనుమలు ఈ తాత ప్రేమాభిమానాలను పొందే అవకాశమూలేదు. రామారావు, భార్యా, బిక్కు బిక్కుమంటూ సొంత ఇంట్లో ఉంటూ, కొడుకు ప్రతినెలా పంపించే డాలర్లని చూసి మురిసిపోవలసిందే తప్ప, ఈశేష జీవితంలో ఆ దంపతులకు సంతోషం, సంతృప్తి లేదు. ఆభావాన్ని మాత్రం వాళ్ళు ప్రకటించరు. డాలర్లు ఆర్థిక సహాయాన్నివ్వ గల వేమో గానీ ఆప్యాయతానురాగాల్ని, ప్రేమాభిమానాల్ని ఇవ్వగలవా? ఆడాలర్ల లెక్కలు చూసుకుంటూ రోజులు లెక్కబెట్టుకుంటున్నారా దంపతులు. వాళ్ళ పరిస్థితి చూసి నాకు జాలివేస్తుంది. ఒక్క కుక్కపిల్లని పెంచుకోండి విశ్వాసంగా పడి ఉంటుందని ఓ ఉచిత సలహా ఇచ్చాను రామారావుకి.

000

నేనూ ఇప్పుడు తాతనయ్యాను. మరికొద్ది రోజుల్లో రిటైర్ అవబోతున్నాను. ఇక భవిష్యత్తులో నా పరిస్థితి ఎలా ఉంటుందోనన్న భావన మదిలో మెదలినప్పుడూ ఏదో తెలియని ఆందోళన యెదలో తరంగాల్లో మెదలుతుంది. నాకు కొడుకుల్లేరు. ఒక్కర్తే కూతురు. సర్వీసులో ఉండగానే పదేళ్ళ క్రితం దాని పెళ్ళి చేశాను. అల్లుడు, కూతురు హైదరాబాదులో ఉంటున్నారు. వారికిద్దరు పిల్లలు ఒక పాప, ఒక బాబు. నామనుమల్ని దసరా శలవలకి మా ఊరు రమ్మన్నాను. ఈ ఊర్లో సరదాగా ఓ పదిహేను రోజులు గడపడానికి అమ్మాయి

మాకు ఇద్దరు మనుమలు బొద్దుగా, ముద్దుగా ఉంటారంటూ అక్కడ, వాళ్ళ వేడుకలు, సంబరాలు, సరదాలు, బర్త్‌డే ఫంక్షన్‌లో తీసిన ఫోటోల్ని ఇంటర్నెట్‌లో చూసుకుని, చుట్టు పక్కల వాళ్ళకి చూపిస్తూ మురిసిపోతూంటాడు. నాక్కూడా అప్పుడప్పుడూ ఆ ఫోటోలు చూపిస్తూంటాడు. కాని తాతగా అతని అచ్చటా ముచ్చటా తీరే అవకాశం లేదు. మనుమలు ఈ తాత ప్రేమాభిమానాలను పొందే అవకాశమూలేదు.

పిల్లలూ ఈరోజే వస్తున్నారు. వాళ్లని రిసీవ్ చేసుకోవడానికి స్టేషన్‌కి వెళ్ళి వాళ్ళని ఆటోలో ఇంటికి తీసుకువచ్చాను. ఇంటికి చేరిన లగాయితూ పిల్లలు ఒకటే ఆట. ఇంటిలోగిలిలో బాగా జాగా ఉండటం వలన ప్రక్కింటి పిల్లలతో కలిసి క్రికెట్ ఆట మొదలెట్టారు. తాతతో సరదాగా కబుర్లు చెబుతూ కాలం గడిపే శ్రద్ధా, సమయం వాళ్ళకేది? ఇక తల్లీ కూతుళ్ళు సరేసరి. వంటింట్లో దూరి ఏవో సాదక బాధకాలు చర్చించుకుంటున్నారు.

వేసవి శలవలు కదా, ఒక నెలరోజులుండి వెళ్ళమన్నాను సరితను. 'నాన్నా! హైదరాబాద్‌లో వాళ్ళకి సమ్మర్ క్లాసులు, కోచింగ్ క్యాంపులు ఏవో ఉన్నాయి. పదిహేను రోజులకంటే ఒక్కరోజు కూడా ఎక్కువ ఉండటానికవకాసం అస్సలు లేదునాన్నా!' అంది. రిటర్న్ జర్నీ రిజర్వేషన్ గోదావరి ఎక్స్‌ప్రెస్‌కి చేయించుకుని మరీ వచ్చింది. నా మనుమలు ఆటల్లో ఒకటే బిజీ తాతతో సరదాగా కథలు కబుర్లు చెప్పించుకునే కుతూహలంగానీ, ఉత్సాహంగానీ ఇనుమంతయినా వాళ్ళలో నాకు కనిపించలేదు. ఎప్పుడూ ఆట. ఇంక ఇల్లు చేరాక ఆ టీవీ ముందు కూర్చుని రిమోట్‌తో ఛానల్స్ తిప్పుతూ కాలం గడిపేస్తున్నారు. నా చిన్నతనంలో మా తాతగారితో నేను గడిపిన రోజులు గుర్తుకొచ్చి, 'ఒరేయ్ ! పిల్లలూ ఇవాళ సాయంత్రం మనం అలా బజార్లోకి వెళ్దాం నాతో వస్తారా?' అని అడిగాను. 'తాతగారూ! సాయంత్రం టీవీలో "స్పైడర్‌మాన్" సినిమా వస్తుంది మేం బజారుకి

రాం!' అని తెగేసి చెప్పేశారు. ఈ పదిహేను రోజులూ వాళ్ళ ధోరణిలో వాళ్ళు గడిపారు, కానీ వాళ్ళతో సరదాగా గడపాలన్న నా సరదా మాత్రం తీరలేదు. వాళ్ళు హైదరాబాద్ తిరిగి వెళ్ళిపోయే రోజు దగ్గరకొచ్చేసింది. నా పోరు పడలేక ఒకరోజు మాత్రం నాతో బజారుకి రావడానికి ఒప్పుకున్నారు.

నా మనుమలతో సహా సాయంత్రం అలా బజారులోకి వెళ్ళాం. దారి నిండా తోపుడుబళ్ళు. వాటి నిండా రకరకాల పళ్ళు. వాటిని చూసి నా మనుమలు ఆకర్షింపబడలేదు. వాళ్ళ దృష్టి వాటి మీదకి పోనూలేదు. ఆ పళ్ళని కొనమనివారు మారాం చెయనూలేదు. మిఠాయి దుకాణాల్ని కూడా చూస్తూ దాటేశారు. అద్దాలలోని రకరకాల స్వీట్స్‌ని చూసి ఆకర్షింపబడలేదు. నన్ను మాత్రం ఒక బేకరీలోకి లాక్కెళ్ళారు. అక్కడ ఏవో 'పిజ్జా'లట, 'బర్గర్'లట, 'క్రీవఫ్'లట అవన్నీ ఆర్డరిచ్చి నాతో కొనిపించారు. నాచేతిలో ఏ 'సంచీ' లేదు. కొన్న సరుకులన్నీ షాపువాడు ఓ 'పాలిథిన్' బాగ్‌లో ముడికట్టి చేతికందించాడు. దారిలో కూరలేమైనా కొందామని కూరల షాపుకెళ్ళాను. ఆ కూరల షాపువాడు కూడా కూరలన్నీ ఓ 'పాలిథిన్' బాగ్‌లో ముడివేసి నా చేతికందించాడు. ఇంటికెళ్ళి ఆ సరుకులన్నీ 'పాలిథిన్' బాగ్స్‌లోంచి ఖాళీచేసి ఆ బాగ్స్‌ని ఓ 'డస్ట్‌బిన్'లోకి విసిరేశారు పిల్లలు.

000

ఈ రోజే సరిత హైదరాబాద్ ప్రయాణం. కూతుర్ని, పిల్లల్ని స్టేషన్‌కి దిగబెట్టడానికి వెళ్ళాను. నా మనుమల కళ్లలో నానుంచి వేరైపోతున్నారనే బాధ కొంచమైనా కనిపించలేదు. వాళ్ళు హైదరాబాద్ చేరాక చేయవలసి తదుపరి కార్యక్రమాల గురించి చర్చించుకుంటున్నారు. రైలు కదులుతుండగా 'ఫార్మాలిటీసేక్ 'టాటా ! తాతా! ' అన్నారు. ఆరోజుల్లో మా తాతగారు మమ్మల్ని స్టేషన్‌కి దిగబెట్టడానికి వచ్చినప్పుడు రైలు ఒకటి రెండు స్టేషన్లు దాటేవరకూ ఎంతో బాధగా ఉండేది. ఆయన తలపులు నా మనసులో మెదిలేవి.

ఇంటికి తిరుగు ప్రయాణంలో దారిలో నా మనసులో కొన్ని పాత జ్ఞాపకాలు మెదిలాయి. మా తాతగారి

ఆనాటి తాతా మనుమల సంబంధాలు పాత గుడ్డ సంచీలా పట్టుగా, దిట్టంగా ప్రేమాభిమానాలతో నిండి ఉండేవి. ఈనాటి తాతా మనుమల సంబంధాలు 'పాలిథిన్' బాగ్‌లా సున్నితంగా ఉంటూ చిరిగి చెత్తకుండీ చేరి కల్తీని,ఐ కాలుష్యాన్ని సృష్టిస్తున్నాయి . తిరిగి ఆ 'పాతసంచీ' రోజులెప్పుడొస్తాయో?

పాత సంచీ ఆయనతో మేము గడిపిన 'ఇత్వారీ' రోజులు.

ఈనాటి తాతలకి మనుమలతో సరదాగా కొన్ని రోజులు గడిపే అవకాశాలు కనుమరుగవుతున్నాయి. ఒకవేళ మనుమలు తాతతో ఒకే ఇంటిలో ఉన్నా ఉదయాన్నే స్కూలుకి పోయి తిరిగి ఏ రాత్రో ఈసురోమని ఇల్లు చేరుతారు. ఇల్లు చేరాక హోంవర్కులూ, ఎసైన్‌మెంట్లూ, ఇక కొద్దో గొప్పో సమయం దక్కిందంటే ఆ మాయదారి టీవీ కతుక్కుపోతారు. వాళ్ళ తాతతో కథలు, కబుర్లు చెప్పించుకునే కుతూహలంగానీ అవకాశంగానీ లేనేలేదు. ఆనాటి తాతా మనుమల సంబంధాలు పాత గుడ్డ సంచీలా పట్టుగా, దిట్టంగా ప్రేమాభిమానాలతో నిండి ఉండేవి. ఈనాటి తాతా మనుమల సంబంధాలు 'పాలిథిన్' బాగ్‌లా సున్నితంగా ఉంటూ చిరిగి చెత్తకుండీ చేరి కల్తీని, కాలుష్యాన్ని సృష్టిస్తున్నాయి . తిరిగి ఆ 'పాతసంచీ' రోజులెప్పుడొస్తాయో? ఇల్లుచేరి గదిలో మూలనున్న పాత ఇనుపపెట్టిని సర్దుతున్నాను. ఆ పెట్టెలో పాత బట్టలతోపాటు మా తాతగారి పాత కలంకారీ చేతి సంచీ బయటపడింది. దాన్ని దులిపి శుభ్రం చేసి ఎదురుగా ఉన్న బట్టల కొక్కానికి తగిలించాను. ఆ సంచీనే చూస్తూ వాలుకుర్చీలో నడుంవాల్చాను. అలా నిద్రలోకెప్పుడు జారుకున్నానో నాకే తెలీలేదు.

**(సంక్రాంతి సందర్భంగా 'రంజని' నిర్వహించిన కీ.శే. రాయప్రోలు రామక్రిష్ణయ్య గారి స్మారక కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ)**